# నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

- అమ్మ, నల్ల చెరువులను తాగునీటికి అనుకూలంగా తీర్చిదిద్దుతా
- ఇప్పుడు చేసింది పావులవంతే..
- రాష్ట్రం, నియోజకవర్గం మరింత పురోగాభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురు



బీఆర్ఎస్‌లో చేరిన పర్వతాపురం గ్రామానికి చెందిన నాయకులతో మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,అక్టోబర్ 29: నియోజకవర్గంలోని ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేశాం, సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా ఎంతో చేశానని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాజనగరం, వడ్డేవీధి, ఖిల్లాఘణపురం మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసం వద్ద ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజనగరం గ్రామాన్ని పట్టణంలో కలపడంతో పాటు గ్రామ చెరువుకు సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ఇప్పటివరకు వాటిలో పావువంతు మాత్రమే పూర్తి చేశామని పేర్కొన్నారు. పట్టణంలోని మురుగు మొత్తం ఈ చెరువులోకి వెళ్తుందని, దాంతో ఈ ప్రాంత భూగర్భ జలాలు విషతుల్యం అవుతున్నాయని, దాని వల్ల పండించిన పంటలు, తాగే నీరు అన్నీ కూడా విషతుల్యం అయి ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. దానిని పరిష్కరించేందుకు ఇప్పటికే ఓ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మురుగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్‌ను అమ్మచెరువు, నల్ల చెరువు వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే ఈ ప్రాంతానికి అమ్మ చెరువును ఆహ్లాదకరమైన వాతావరణ కేంద్రంగా మార్చబోతున్నామన్నారు. జిల్లా కోసం తాను పట్టుబట్టి సాధించుకొని ఒకదాని తర్వాత ఒక్కొక్కటిగా అభివృద్ధి సంక్షేమాలను తీసుకొనిరావడంతో ఎంతో మందికి ఉపాధికి నిలయంగా పట్టణ కేంద్రం మారిం దన్నారు. ప్రతి ఒక్కరికీ బతుకు దెరువుపై ఆలోచన ఉండాలి, ఉన్నతంగా జీవించాలన్నారు. చేసిన అభివృద్ధి మీ కండ్ల ఎదుట కనబడుతుందని, మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

### 12 వ వార్డు నుంచి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేరిక

పట్టణంలోని 12వవార్డు కౌన్సిలర్ అలివేలుగోపాల్, గొర్రెల కాపరుల సంఘం జిల్లా చైర్మన్ కురుమూర్తియాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 45 మంది మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### బీజేపీ జిల్లా అధికారప్రతినిధి చేరిక..

బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి సంతోష్‌కుమార్ యాదవ్‌తోపాటు 10మంది బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీలో సిద్ధాంతాలకు తిలోదకాలు పలికారన్నారు. కింది నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీజేపీలో కూడా అవినీతి మరక మొదలైందన్నారు. వనపర్తి అభివృద్ధి ప్రదాత నిరంజన్‌రెడ్డి నిస్వార్థంగా చేస్తున్న అభివృద్ధికి తోడుగా ఉండి మరోసారి గెలిపించుకోవాలని పార్టీలో చేరుతున్నాన్నారు.

### పర్వతాపురం నుంచి యాదవుల చేరిక..

ఖిల్లాఘణపురం మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 15 మంది మంత్రి సింగిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, రాష్ట్ర మార్క్‌ఫైడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు రాములుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు రఘువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సాగర్, రాజనగరం,వడ్డేవీధి,పర్వతపురం,జిల్లా,పట్టణ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బాధితుడిని పరామర్శించిన మంత్రి

వనపర్తి రూరల్, అక్టోబర్ 29 : మండంలోని చిట్యాల తూర్పు తండాకు చెందిన భీముడు నాయక్ అనార్యోగ కారణంగా రెండు కాళ్లు తీసివేశారు. విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం రాత్రి జిల్లాలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చిక్సిత పొందుతున్న భీముడు నాయక్‌ను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చిట్యాల సర్పంచ్ భాను ప్రకాశ్‌రావు, తూర్పు తండా సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, మండల యువజన నాయకులు చిట్యాల రాము ఉన్నారు.

### మంత్రికి ప్రసాదం అందజేత

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 29 : శృంగేరి శారద మాతను దర్శించుకున్న ఖిల్లా ఘణపురం సర్పంచ్ వెంకటరమణ దంపతులు ప్రసాదాన్ని ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డికి అందజేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మంత్రి గెలవాలని అమ్మవారికి పూజలు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. అనంతరం మంత్రి ప్రసాదం స్వీకరించారు. మంత్రితో పాటు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.

## వచ్చే ఎన్నికల్లో జూపల్లికి డిపాజిట్ గల్లంతే..

- కొల్లాపూర్ పీడను పారద్రోలేందుకు సిద్ధంకావాలి
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కొల్లాపూర్ ప్రాంత ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం



కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, అక్టోబర్ 29: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు డిపాజిట్ గల్లంతేనని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కొల్లాపూర్ ప్రాంత ప్రజలు, విద్యావంతులు, మేధావులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్వార్థ నాయకత్వం, అధికారం కోసం రంగులు మార్చే నాయకులు, దౌర్జన్యం చేస్తున్న నేతలు ఒకవైపు, గ్రామ గ్రామాన అభివృద్ధి చేసే నేతలు మరోవైపు ఉన్నారని, దీన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వనపర్తికి పోటీగా కొల్లాపూర్‌ను అభివృద్ధి చేసుకోవాలని కొల్లాపూర్‌ను విద్యాహబ్‌గా మార్చడానికి కృషి చేయాలన్నారు. కుటుంబ పెద్ద మంచిగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని, చాలామంది సోషల్‌మీడియా పెట్టిన పోస్టుల వల్లనే విజయాలు వరించవని వాటిని నమ్మవద్దని, మనమందరం కష్టపడితే కొల్లాపూర్‌కు పట్టిన పీడ విరుగుడవుతుందని, బీఆర్ఎస్ గెలుపుతోనే కొల్లాపూర్ అభివృద్ధి, సుస్థిర పాలన ఉంటుందన్నారు. కొల్లాపూర్ పీడను పారద్రోలేందుకు చేయి చేయి కలిపి సిద్ధం కావాలని ఎమ్మెల్యే బీరం పిలుపునిచ్చారు. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు డిపాజిట్ గల్లంతయ్యే సమయం అసన్నమైందని ఆయన అన్నారు. ఒక కొల్లాపూర్ అభివృద్ధికే రూ.600 కోట్ల పనులు చేపట్టామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అభిలాశ్‌రావు మట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రజాదరణను ఉదాహరణలతో సహా వివరిం చారు.

### బీజేపీ యువకులు బీఆర్ఎస్‌లో చేరిక..

వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి బీజేపీ నాయకులు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. అదేవిధంగా చింతకుంట గ్రామానికి చెందిన వారు కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగినేని అభిలాశ్‌రావు, జెడ్పీటీసీలు కిరణ్‌కుమార్‌గౌడ్, రాజాగౌడ్, ఎంపీపీలు కమలేశ్వరరావు, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, కొల్లాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ సోమనాథ్‌నాయుడు, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మునీరుద్దీన్, ఇంద్రసేనారెడ్డి, చిన్నారెడ్డి, సత్యనారాయణగౌడ్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఇతర నాయకులు ఉన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే కష్టకాలమే

- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- గులాబీ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 29 : అభివృద్ధి వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీయేనని, వారిని నమ్మితే నట్టేట ముంచడం ఖాయమని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లి తండా కొడావత్, మెగావత్ కాలనీలకు చెందిన 100మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్డాకుల జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే ఆల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం 60ఏండ్ల అభివృద్ధిని కేవలం పదేండ్లలో చేసి చూపట్టడమేనన్నారు. తెలంగాణలో మూడోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ కమిటీ అధ్యక్షుడు ఆశోక్‌కుమార్, నాయకులు వెంకటేశ్‌నాయక్, రాజునాయక్, సూర్యనాయక్, యాదగిరినాయక్, జానునాయక్, పెంటా, మెగావత్, గోవిందు, రామచంద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీ నాయకుల చేరిక..

భూత్పూర్, అక్టోబర్ 29 : మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ యువకులు 35మంది ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆశన్న, నవీన్, యాదయ్య, రామస్వామి, మహేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ సాయిలు, కౌన్సిలర్ రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, పట్టణాధ్యక్షుడు బాలస్వామి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం
- సీఎం సభా స్థలం పరిశీలన



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

మాగనూర్, అక్టోబర్ 29 : పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉన్నదని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయులుగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చిపోయే వాళ్లను ప్రజలు నమ్మరని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధికి ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. సమావేశంలో రైతుబంధు సమితి సభ్యురాలు సుచరిత, మాగనూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రైతు సమన్వయ సమితి సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు..

మక్తల్ టౌన్, అక్టోబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 6వ తేదీన మక్తల్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తగార్లపల్లి రోడ్డు శివారులో ఏర్పాటు చేస్తున్న బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు.